క్లుప్తంగా

జిల్లాస్థాయి షటిల్ విజేత ఎజాజ్‌అలీ-జిషాన్

మహబూబ్‌నగర్ క్రీడలు: కొత్త మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన ఓపెన్ జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు హుషారుగా సాగాయి. 32 డబుల్స్ జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో సయ్యద్ ఎజాజ్‌అలీ-జిషాన్‌లు 21-10, 21-13 వరుసగా రెండు సెట్లలో ఎన్‌జే.జోయెల్-భాను ప్రకాష్‌లపై విజయం సాధించి విజేతగా నిలిచారు. మూడోస్థానంలో సయ్యద్ అద్నాన్-సమీ జట్టు నిలిచింది. గెలుపొందిన జట్లకు ఆదివారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ట్రోఫీలు అందజేయనున్నారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక చట్టాలు

భూత్పూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను కార్పొరేట్ యాజమాన్యానికి అనుకూలంగా మార్చాయని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి యాదయ్య విమర్శించారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక బ్రిటీష్ కాలంలో పోరాటం చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్పొరేట్ యాజమాన్యానికి అనుకూలంగా చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రేడ్ యూనియన్లను, చట్టాన్ని మారుస్తూ భవిష్యత్‌లో పర్మనెంట్ ఉద్యోగాలు, ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని, హయ్యర్ హ్యాండ్ ఫైర్ అనే విధానాన్ని ప్రవేశపెట్టి, ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్‌తో శాశ్వత ఉద్యోగులు లేకుండా ప్రభుత్వాలు చేస్తున్నాయని మండిపడ్డారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, కార్మికుల నాయకులపై కేసులు పెట్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రామ్మోహన్, సురేష్, నర్సింహులు, శ్రీనివాసులు, చెన్నయ్య, కేశవులు, భాగ్యలక్ష్మి, జిల్లా సురేష్ తదితరులు ఉన్నారు.

హజిలాపూర్‌లో గొర్రెల పంపిణీ

దేవరకద్ర రూరల్: హజిలాపూర్‌లో శనివారం ఆరుగురు లబ్ధిదారులకు పశువైద్యుడు జీషన్ అలీ, సర్పంచ్ బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీకాంత్‌యాదవ్, వెంకటేష్ గొర్రెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్ గౌడ్, శాంతకుమార్, రఘురాంగౌడ్, కరుణాకర్, బాలయ్య, నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పోలేపల్లి విద్యార్థి

జడ్చర్ల టౌన్: సంగారెడ్డి జిల్లాలో ఆదివారం నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు మండలంలోని పోలేపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి శ్రీరాం ఎంపికైనట్లు పీఈటీ కృష్ణ తెలిపారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మోయిన్, శ్రీను, శ్రీహరి అభినందించారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు

జడ్చర్ల టౌన్: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించే శిబిరాన్ని చైర్‌పర్సన్ లక్ష్మి ప్రారంభించారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి సమత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది కార్మికులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మాత్రలు అందజేశారు.

ఆత్మగౌరవ పోరాట జెండా పండుగ

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని తిమ్మసానిపల్లి ఎరుకలవాడలో ఆత్మగౌరవ పోరాట జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాల్‌కోట శ్రీనివాసులు మాట్లాడుతూ ఇతర తెగలతో పోల్చుకుంటే రాష్ట్రంలో 10 లక్షల జనాభా ఉన్న ఎరుకల ప్రజలు విద్య, ఉద్యోగ, ఉపాధితో పాటు రాజకీయ రంగాలలో చాలా వెనుకబడి ఉన్నారని అన్నారు. సీఎం కేసీఆర్ ఎరుకులను గుర్తించి గౌరవప్రదంగా నామినేటెడ్ స్థానాలలోనైనా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

రేషన్‌బియ్యం పట్టివేత

చిన్నచింతకుంట: మండల కేంద్రానికి చెందిన దాసరి యువరాజు అక్రమంగా 20 క్వింటాల రేషన్ బియ్యాన్ని గూడ్స్ వాహనంలో శుక్రవారం రాత్రి తరలిస్తుండగా ఉంద్యాల సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

పట్టణ, మండల అధ్యక్షుల నియామకం



వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్‌అలీ

స్టేషన్ మహబూబ్‌నగర్: అసెంబ్లీ నియోజకవర్గం పట్టణ, మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ను నియామకం చేశా రు. పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సీనియర్ నాయకుడు మహ్మద్ ఖాజాఅజ్మత్‌అలీ నియమితులయ్యారు. అదే విధంగా పట్టణ అధ్యక్షుడిగా లక్ష్మణ్‌యాదవ్, మహబూబ్‌నగర్ రూరల్ అధ్యక్షుడిగా మల్లు నర్సింహారెడ్డి తిరిగి రెండోసారి నియామకం అయ్యారు. హన్వాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎం.కృష్ణయ్య నియమితులయ్యారు. వీరిని నియమిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ నియామకపత్రం జారీ చేశారు.

కాంగ్రెస్ వస్తే మళ్లీ అరాచకమే

- అప్పటికి ఇప్పటికీ అభివృద్ధిలో ఎంతో తేడా
- మహబూబ్‌నగర్ ఊహించని విధంగా అభివృద్ధి
- రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ



అప్పాయిపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, ప్రజాప్రతినిధులు

మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ అరాచకం రాజ్యమేలుతుందని, అందుకే ప్రజలంతా వారితో అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. బీఆర్‌ఎస్ వల్లే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోనే రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం సాధ్యమైందని తెలిపారు. శనివారం మహబూబ్‌నగర్ రూరల్ మండలం అప్పాయిపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హోం మంత్రి, ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. గ్రామానికి ఓపెన్ టాప్ వాహనంలో మంత్రులు ఊరేగింపుగా చేరుకున్నారు. వారికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో సీసీరోడ్లు, హైమాస్ట్ లైట్లను, డ్వాక్రా భవనాన్ని ప్రారంభించారు. మహిళా సమాఖ్య భవనానికి భూమిపూజ చేశారు. హోం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పాటుకు ముందు రాష్ట్రం ఎంతో వెనుకబడి ఉండేదని, అందులో మహబూబ్‌నగర్ మరింత వెనుకబాటుకు గురైందని, అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత జిల్లా ఊహించని విధంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. డైనమిక్ మినిస్టర్ శ్రీనివాస్‌గౌడ్ వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు.

పాలమూరు ప్రాజెక్టుతో సస్యశ్యామలం

సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల ప్రారంభించిన పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలను కృష్ణ జలాలతో నింపి సాగు నీటిని అందిస్తామని అన్నారు.

మండలంలోని అల్లీపూర్, బొక్కలోనిపల్లి, జమిస్తాపూర్, తెలుగుగూడెం, అప్పాయిపల్లి, ఓబ్లాయిపల్లి, ఓబ్లాయిపల్లి తండా, కోటకదిరలో పర్యటించిన వారు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ అనిత, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అల్లావుద్దీన్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సీసీరోడ్లను ప్రారంభించిన మంత్రి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక బండమీదిపల్లిలో రెండు సీసీరోడ్లు, డ్రెయినేజీలను శనివారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్లు ఉమర్‌పాషా, జి.లక్ష్మీదేవి, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

కాల్వలు తీయొద్దని గ్రామస్తుల తీర్మానం



అభిప్రాయాలను సేకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్యోతి, అధికారులు

మిడ్జిల్: మండలంలోని వెలుగొమ్ములలో కేఎల్‌ఐ డిస్ట్రిబ్యూటర్ కాల్వలను పంట పొలాల మధ్యలో నుంచి తీయొద్దని గ్రామస్తులు తీర్మానించారు. శనివారం జిల్లా రెవెన్యూ భూ పరిపాలన విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. కాల్వలు తీసేందుకు తాము పొలాలు ఇచ్చేందుకు సిద్ధంగాలేమని రైతులు తెలిపారు. మరోసారి ఆలోచించాలని అధికారులు డిప్యూటీ కలెక్టర్‌కు సూచించారు. కాల్వలు తీయడం ద్వారా సాగునీరు వస్తుందని గ్రామస్తులందరికీ మేలు కలుగుతుందన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ కృష్ణమోహన్, కేఎల్‌ఐ అధికారి లాలు, సర్పంచ్ అంజమ్మ, ఆర్‌ఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి



మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ముదిరాజ్‌లు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు కిషోర్‌ముదిరాజ్ అన్నారు. శనివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మాట్లాడుతూ.. ముదిరాజ్ భవన నిర్మాణానికి గతంలో ఉన్న ఏ ఒక్క ఎమ్మెల్యే పట్టించుకోలేదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ భవన నిర్మాణం కోసం రూ.3 కోట్లు నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ముదిరాజ్‌ల ఆత్మగౌరవం కోసం కృషి చేస్తున్న మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 3వ తేదీన జేజేఆర్ గార్డెన్‌లో మధ్యాహ్నం ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్, ముదిరాజ్‌మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ద విజయ్‌కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ గణేష్ మాట్లాడుతూ ముదిరాజ్‌లు పెద్ద సంఖ్యలో ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావాలని కోరారు.

పథకాన్ని లబ్ధిదారులందరికీ వర్తింపజేయాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

స్టేషన్ మహబూబ్‌నగర్: గొర్రెల పంపిణీ పథకాన్ని లబ్ధిదారులందరికీ వర్తింపజేయాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గొర్రెల పంపిణీ పథకం కింద జిల్లా వ్యాప్తంగా 11,500 మంది యాదవులు డీడీలు కడితే కేవలం 1,233 మందికే ఇచ్చారన్నారు. మిగతా లబ్ధిదారులకు వెంటనే యూనిట్లు మంజూరు చేసిన తర్వాతనే యాదవుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే సమ్మేళనానికి వచ్చే అర్హత మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు లేదన్నారు. డీడీలు కట్టిన వారికి వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాములుయాదవ్, బండి మల్లేష్ యాదవ్, నరేష్ బాబు, రఘు యాదవ్, బుచ్చన్న యాదవ్, శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సకల జనులకు సమన్యాయం

బాలానగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సకల జనులకు సమన్యాయం చేకూరుతుందని మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాదయ్య, భాస్కర్ గౌడ్, రాజు, ప్రవీణ్ యాదవ్, యాదయ్య పాల్గొన్నారు.

సుంకరామయ్యపల్లికి కృష్ణా జలాలు



చెరువులోకి వస్తున్న కృష్ణా జలాలు

అడ్డాకుల: మండలంలోని సుంకరామయ్యపల్లి చౌట చెరువుకు ఎట్టకేలకు కృష్ణా జలాలు చేరాయి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఖిల్లాఘనపురం మండలం మీదుగా కొన్నాళ్ల నుంచి కాల్వ తవ్వే పనులు చేస్తున్నారు. ఉప్పరిపల్లి వద్ద కాల్వ పనులు ముందుకు సాగకుండా అక్కడి రైతులు పరిహారం కోసం పనులను ఇటీవల అడ్డుకున్నారు. దీంతో ఇటీవల బీఆర్‌ఎస్ నాయకులు అక్కడి రైతులను ఒప్పించి పనులను అడ్డుకోకుండా చేశారు. దీంతో పనులు పూర్తయ్యి శనివారం కల్వకుర్తి జలాలు సుంకరాంపల్లి చెరువుకు చేరాయి. ఇక్కడి నుంచి కందూర్ శనిగె చెరువు, రామయ్య చెరువుకు చేరుతాయి. అక్కడ అలుగు పారితే శాఖాపూర్ పెద్ద చెరువుకు నీళ్లు చేరే అవకాశం ఉంది. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఎలాంటి సాగునీటి సౌకర్యం లేని సుంకరామయ్యపల్లి చెరువుకు కృష్ణా జలాలు రావడంతో గ్రామస్తులు పట్టలేని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గండేడ్‌ను వికారాబాద్‌లో కలపాలి

గండేడ్: గండేడ్ మండలాన్ని వికారాబాద్ జిల్లాలో కలపాలని కొండాపూర్ ఎంపీటీసీ బాలకిష్టయ్య డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చేపడుతున్న దీక్షలు శనివారం కొనసాగాయి. ఆయన మాట్లాడుతూ.. మండలానికి వికారాబాద్ జిల్లాలో కలపడం మంచిదన్నారు. ఈ జిల్లాతో తమకు చాలా అనుబంధం ఉందన్నారు.

ఈవీఎంలపై అవగాహన

దేవరకద్ర: మండలంలోని గోప్లాపూర్‌లో శనివారం అధికారులు ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలని వారు చూయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్, ఆర్‌ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా బాదేపల్లి జెడ్పీ హైస్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. హైస్కూల్ నుంచి బయలుదేరి పట్టణంలోని కూడళ్లలో ఉన్న మహనీయుల విగ్రహాలకు పూలమాలలు సమర్పించి నివాళి అర్పించారు. స్వచ్ఛభారత్ స్వచ్ఛ దేశ్ అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం పాఠశాలకు తిరిగి వచ్చి మట్టిని పట్టుకుని పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రకళ, ఎన్‌సీసీ అధికారి రఘు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండుగ సాయన్న ఆశయాలను కొనసాగిద్దాం

గండేడ్: పండుగ సాయన్న ఆశయాలను కొనసాగిద్దామని వికారాబాద్ ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. శనివార మండలంలోని కొంరెడ్డిపల్లిలో ముదిరాజ్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆదివారం పరిగిలో పండుగ సాయన్న విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు. అనంతరం విగ్రహ ఆవిష్కరణ బ్రోచర్‌ను విడుదల చేశారు. లక్ష్మయ్య, గోపాల్, రాములు, శ్రీనివాస్, కేశవులు, సత్యనారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు మినిస్టర్ కప్ కరాటే పోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఆర్‌కే స్పోర్ట్స్ కరాటేడూ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పసుల కిష్టారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం మినిస్టర్ కప్ ఆల్‌స్టైల్ రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండర్ రవికుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. కుమితే, కటా, టీమ్ కటాస్, వెపన్ కటాస్ విభాగాల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా విభాగాల్లో గ్రాండ్ చాంపియన్‌షిప్ మినిస్టర్ కప్‌లు అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి దాదాపు 500 మంది కరాటే విద్యార్థులు పాల్గొంటారని, ఉదయం 10.30 గంటలకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి



జడ్చర్ల మహాసభలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్‌గౌడ్

జడ్చర్ల టౌన్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని బాదేపల్లి పీఏసీఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం సంఘ కార్యాలయం వద్ద నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. డీసీసీ బ్యాంక్ బాదేపల్లి బ్రాంచ్ ద్వారా పాడి పశువులు, గ్రామీణప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం, విదేశి చదువులకోసం రుణాలు ఇప్పిస్తారన్నారు. పీఏసీఎస్ ద్వారా నాగసాల వద్ద 2,500 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణం పూర్తి చేసుకున్నామని, త్వరలోనే ప్రారంభించుకుంటామని సభకు తెలియజేశారు. మహాసభలో మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, సీఈఓ యాదగిరి, డీసీసీబీ బీఎం జాఫర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వన్‌టైం సెటిల్‌మెంట్ కోసం తీర్మానం

నవాబుపేట: సహకార సంఘంలో గతంలో పంటల కోసం రైతులు తీసుకున్న రుణాలకు సంబంధించి వన్‌టైం సెటిల్‌మెంట్ సంవత్సరాలను నేటి ఆర్థిక సంవత్సరం వరకు పొడిగించాలని సహకార సంఘం తీర్మానం చేస్తున్నట్లు చైర్మన్ నర్సింహులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో సహకార సంఘం మహాజన సభ నిర్వహించారు. సమవేశంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, గోపాల్, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను సేకరించిన మహిళలు



బీకేరెడ్డి కాలనీలో చెత్తను సేకరిస్తున్న మహిళలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'స్వచ్ఛతా మీ సేవ'లో భాగంగా మొదటిరోజు శనివారం మొత్తం 49కి గాను 16 వార్డుల్లో రోడ్లు, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. వార్డుల్లో పారిశుద్ధ్య కార్మికులు చెత్తను సేకరించారు. స్థానికులు, మహిళా సంఘం సభ్యులతో కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు. వారితో మున్సిపల్ అధికారులు స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తోకల యాదమ్మ, పటేల్ ప్రవీణ్‌కుమార్, మూషా నరేందర్, రాణి, షబ్బీర్ అహ్మద్, రావుల అనంతరెడ్డి, కొల్లె చెన్నవీరయ్య, ఏఎస్‌ఓ సలీం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, రవీందర్‌రెడ్డి, వాణికుమారి తదితరులు పాల్గొన్నారు.

గంగఒడికి గణనాథుడు

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని పాతపాలమూరు బీఆర్ అంబేడ్కర్ యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన బొజ్జ గణపయ్యను భక్తిశ్రద్ధలతో ఉత్సవ కమిటీ సభ్యులు గంగ ఒడికి చేర్చారు. శనివారం మధ్యాహ్నం బీచుపల్లి కృష్ణానదిలో క్రైన్ సహాయంతో నిమజ్జనం చేశారు. వేలంపాటలో ఎంగగళ్ల నాగరాజు 151 కిలోల లడ్డూను రూ. 1,50,116లకు దక్కించుకున్నాడు.

బాలానగర్: మండలంలోని పెద్దరేవల్లి వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ లడ్డు రూ.1,05,516 పలికింది. గ్రామానికి చెందిన శరత్‌కుమార్ లడ్డును దక్కించుకున్నారు.

జ్యువెల్ సిటి గోల్డ్ షాప్‌లో వార్షిక సంబరాలు



నగలు కొంటున్న వినియోగదారులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం తూర్పు కమాన్ సమీపంలోని జ్యువెల్‌సిటి గోల్డ్‌షాప్ 13వ వార్షికోత్సవ సంబరాలను శనివారం నిర్వహించారు. షోరూంలో సరికొత్త డిజైన్లు, దివ్యమైన కలెక్షన్లు కస్టమర్లను ఆకర్షింపజేస్తున్నాయని యజమాని రమేష్ తెలిపారు. ఆసక్తి ఉన్న వినియోగదారులు బంగారాన్ని కొనుగోలు చేయాలని అయన కోరారు.

స్వచ్ఛతపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'స్వచ్ఛతా హీ సేవ'లో భాగంగా శనివారం స్థానిక బండమీదిపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించి కళాశాలలోని తరగతి గదులతో పాటు ఆవరణలో ఎక్కడికక్కడ చెత్తను సేకరించారు. అనంతరం స్వచ్ఛతపై మున్సిపల్ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు.

ఘనంగా ఎమ్మెల్యే ఆల జన్మదిన వేడుకలు



దేవరకద్రలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలుపుతున్న హోం మంత్రి మహమూద్‌అలీ



దేవరకద్రలో రక్తదానం చేస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

దేవరకద్ర: నియోజకవర్గకేంద్రంలో శనివారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులతో పాటు వేలాదిగా తరలి వచ్చిన కార్యకర్తలతో పట్టణం అంతా కిక్కిరిసిపోయింది. అనంతరం శ్రీనివాసగార్డెన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కేక్ కట్ చేసి నాయకులకు అందించారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ హాజరై ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందించారు. అదేవిధంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్ డాక్టర్ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 12 విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు హాజరై ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. సిటీ న్యూరో హాస్పిటల్ వారి సహకారంతో పది మంది విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌ట్యాప్‌లను అందజేశారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంలో వందలాది మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ అన్నపూర్ణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజయ, వైస్ ఎంపీపీ సుజాత, జట్టినర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేష్, కొండశ్రీనివాస్‌రెడ్డి, శివానంద్, ఆంజనేయులు, వెంకట్రాములు, భాస్కర్‌రెడ్డి, చల్మారెడ్డి, యుగంధర్‌రెడ్డి, కొండారెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

భూత్పూర్: పట్టణంలోని రామలింగేశ్వర దేవాలయంలో శనివారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మంజుల దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, పూల దండలు, శాలువాలతో సత్కరించారు.

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలాల్లో శనివారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. అడ్డాకులలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మూసాపేట మండలం నిజాలాపూర్‌లో జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించగా 52 మంది రక్తదానం చేశారు.

పార్టీకి పూర్వవైభవం



కాంగ్రెస్‌లో చేరిన వారితో పీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొల్లూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో ఎమ్మెల్యే ఇచ్చిన మండల హామీ విస్మరించటంతో అందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. అధికార పార్టీ కేవలం బీఆర్‌ఎస్ నాయకులకు ప్రభుత్వ పథకాలు అందిస్తు ప్రజా సంక్షేమంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బహుమతిగా ఇవ్వనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నుంచి వంద మంది కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి, రాంచంద్రయ్య, ఎంపీటీసీ తులసీరాంనాయక్, వాసుయాదవ్, ఖాజా, రాజేష్, షబ్బీర్, నర్సింహచారి, కుమార్ తదితరులు ఉన్నారు.

చేరింది బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాదు

కాంగ్రెస్‌లో చేరిన వారిలో కొల్లూర్ బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఎవరూ లేరని బీఆర్‌ఎస్ నాయకులు రఘుగౌడ్, చందర్‌నాయక్, రమేష్, బాలకిష్టయ్య ప్రకటించారు.

జేపీఎన్‌సీఈలో శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండలంలోని జేపీఎన్‌సీఈ కళాశాలలో విద్యార్థులకు ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం జరిగింది. ఇందులో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కళాశాలలో పలు కోర్సులకు సంబంధించి 120 మందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజీవన్, హెచ్‌ఓడీ గురురాఘవేందర్ రెడ్డి, రాధిక తదితరులు పాల్గొన్నారు.